


ఓం నమో భగవతే శ్రీ రమణాయ

# రమణ భాస్కర



సంపుటి : 8 సంచిక : 24 పుష్పం : 58-59 05-09-2003

RAMANA BHASKARA
TELUGU SPIRITUAL FORTNIGHT MAGAZINE
PAGES : 16
VOL : 8 ISSUE : 24
EDITOR
P.S. RAMA RAJU
EDITING
P.H.V. SATYAVATHI
(HYMA)
SUBSCRIPTION
Yearly : **Rs. 150/-**
Each Copy : **Rs. 8/-**

ADDRESS
RAMANA BHASKARA
SRI RAMANAKSHETRAM
JINNURU - 534 265
W.G.Dt., A.P.
PUBLISHER
P.S. RAMARAJU
LAKSHMI
MODERN RICE MILL
ULLAMPARRU - PALAKOL
☎08814 - 224589, 224689
PRINTER
SHRIRAM GRAPHICS
BANK STREET - PALAKOL
☎08814 - 222438, 221260
94401-31188

## ఆనందమే గురురూపంగాదర్శన మౌతుంది

ఆనందమేబ్రహ్మం-దానినుండి ఉద్భవించిన ఒక రస్మి శరీరం, మనస్సులతో చిక్కుకొని చివరకు ప్రకృతిలో ఆనందంలేదని విసిగి సత్యాన్వేషణకై నిజమైన తపనరేకెత్తినప్పడు పరమాత్మతన కృపావర్షాన్ని దానిపై కురిపించి సద్గురువు వద్దకు చేరుస్తాడు. దానితో అతనిలో సత్యమైన ప్రేమ, భక్తిమేల్కొంటాయి. గురువుతనకృపతో వాడిని కృతార్థుణ్ణిచేస్తారు. ఈప్రక్రియలో వారికి విసుగు-విరామంలేకుండా వానిపరిపూర్ణతకై పరితపించి, పనిజేస్తారు. ఆనందం బజారులో కొనుక్కొనేదికాదు. పళ్లు, పైసలు ఎరగాజూపి గురువునుండి దానిని పొందలేము. వినయం, త్రికరణశుద్ధి నిజాయితీతో కూడిన సాధన పురస్కరించి పొందాలి. “ధ్యానంలో అత్యున్నతస్థితికి వెళ్లి అక్కడ తనగురువును దర్శించిన రాణి ఇందుమతి, “కబీర్” తో స్వామీ మీరే పరమాత్మఅని ముందుగా నాకు ఎందుకు తెలుపలేదు “అని అనగా” అప్పడే చెబితే నీవునమ్మే దానవుకాదు అంటారు. శ్రీనాన్నగారు అంటారు నేను చేసే సాయంమీబుద్ధికి అందదు జ్ఞానిభక్తుని హృదయంలో సైలెంటుగా పనిజేసి తనకర్తవ్యాన్ని నెరవేర్చుకొంటాడు. ఎవరైనా చెడ్డవాళ్లు ఉన్నా జ్ఞానిపైన సజీవవిశ్వాసం ఉంటేవారు ఉద్ధరించబడతారు అన్నారు. పూర్ణగురువులే పూర్ణత్వాన్ని ప్రసాదిస్తారు. ఈసత్యాన్ని గుర్తించలేనివారు ఎదురుగా ఉన్నఅమృతబాండాన్ని చూస్తూ చూస్తూ కాలదన్నుకొంటారు. “సద్గురు పవిత్రపాదాల ముందు నేను మోకరిస్తాను ఆయన ప్రేమకు, దయకు మహాసముద్రుడు. బయటచీకటిని సూర్యకిరణాలు తొలగించినట్లే ప్రపంచబందనాల అంధకారాన్ని మాటలతో తొలగించే మానవరూపి పరమాత్మ” అన్నారు తులసీదాస్. గురువు వద్దకు వేల సంఖ్యలో వస్తారు, వెళ్లిపోతారు పుణ్యంపండిన వాళ్లేపరమాత్మ అని నమ్ముతారు. పుట్టుగుడ్డివాడు వస్తువులను గుర్తించలేడు అలాగే పరమాత్మ అనుగ్రహం ఉన్నవారేగురుసామ్రాజ్యంలో ప్రవేశించి అలౌకికమైన ఆనందానికి వారసులౌతారు. ప్రకృతిప్రేమలో వెగటు, వగరు, పరిమితులు ఉంటాయి కాని గురువుప్రేమలో పరిమితులు ఉండవు అది పూర్ణం. శిష్యుల సంఖ్యనుబట్టి ఆ ఆనందం ఆధారపడి ఉండదు. అది స్వతంత్రమైనది-ఆనందమే ఆనందాన్ని ఎంజాయ్‌చేస్తుంది. అటువంటి ఆనందరూపమైన గురువును ఆరాధించి ఆనందమయులౌదాము.

సాగిరాజు రామకృష్ణంరాజు
అర్థవరం

ఈ సంచికలో......

**సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు**

10-8-2003 జిన్నూరు ........ 3
17-8-2003 విజయవాడ ........ 10

# సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 10-08-2003, జిన్నూరు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మానవుడు ఏ పనిచేసినా ఆనందం కోసమే చేస్తాడు. వాడు మంచిపనులు చేసినా, చెడుపనులు చేసినా వాడు చేసేపనుల ద్వారా నిజంగా ఆనందం రాకపోయినా, ఆనందం వస్తుందని ఆపనులు చేస్తూఉంటాడు ముఖ్యంగా మనం నేర్చుకోవలసింది ఏమిటి అంటే నన్ను నేను బ్రహ్మంగా చూసుకోవాలి, నేను మిమ్మల్ని బ్రహ్మంగా చూడటం నేర్చుకోవాలి, అప్పుడు వికారాలు రావు. ఇలా అభ్యాసం చేస్తూఉంటే, నిరంతరం బ్రహ్మభావనతో ఉంటే ఏదోరోజున బ్రహ్మానుభవం కలుగుతుంది, బ్రహ్మానుభవం కలిగాక బ్రహ్మానందం వస్తుంది. బ్రహ్మం ఎక్కడ ఉంది అంటే మనహృదయంలోనే ఉంది కాని దానిని తెలుసుకోవాలనే కాంక్ష మనకు ఉదయించటంలేదు దానికి కారణం మనకు తగినంత పుణ్యబలం లేదు. బహుజన్మలు సత్కర్మలు చేస్తేగాని, బహుజన్మలు సద్వస్తువు గురించి శ్రవణంచేస్తేగాని ముముక్షత్వంరాదు. భక్తులువేరు, ముముక్షులువేరు. మంచిపనులు చేసేవారుకూడా ఏదో స్వర్గలోకానికి వెళ్లవచ్చు అనిచేస్తారు. వారు స్వర్గలోకానికి వెళితే వెళ్లవచ్చుగాని హృదయంలో ఉన్న వస్తువు మటుకు వారికి తెలియదు. బ్రహ్మానుభవం కలిగేవరకూ, హృదయంలోఉన్న వస్తువు వాడికి గోచరమయ్యేవరకు వాడు ఎంతగొప్పలోకాలకు వెళ్లినా ఏజీవుడికి పతనం తప్పదు. ఈసృష్టికి యజమాని ఈశ్వరుడే. ఆయన అందరి హృదయాలలో అంతర్యామిగా ఉండి, ఆ జీవులు చేస్తున్న పనులనుచూస్తూ వాటికితగినఫలితాన్ని ఇస్తూ ఈసృష్టిని నడుపుతున్నాడు. ఆయనకు తెలియకుండా ఈసృష్టిలో ఏదీజరగటానికి వీలులేదు, జరుగదుకూడా. అయితే ఈశ్వరుడి మీద మనకు ఉండవలసినంత గౌరవంలేదు, విశ్వాసంలేదు. మనం పుణ్యంచేసినా, పాపంచేసినా వెంటనే ఫలితంరాదు, అది పండటానికి కొంతకాలం పడుతుంది. ఈరోజు పుణ్యంచేసి ఇంకా ఫలితంరాలేదు అని అనుకోవద్దు. ఆఫలితం ఎప్పుడు ఇవ్వాలో, ఎక్కడ ఇవ్వాలో, ఎలా ఇవ్వాలో నిర్ణయించేది ఈశ్వరుడు. పాపఫలితం దుఃఖం, పుణ్యఫలితం సుఖం. మీకు అనుభవం అయినతరువాత కాలప్రవాహంలో పాపఫలితం, పుణ్యఫలితం రెండూ కూడాపోతాయి. ఆత్మజ్ఞానం వలన వచ్చేఫలితం మోక్షం. జీవుడు మోక్షానుభవం పొందేవరకు వాడికి మరణంతప్పదు, పుట్టుక తప్పదు, కర్మానుభవం తప్పదు, ప్రకృతి వాడిని విడిచిపెట్టదు.

సంసారం ఎవడికివస్తుంది అంటే వాసనఉన్నవాడికి సంసారం వస్తుంది. వాసనకూడా ఒకరోగం, అదిఎంతకాలం అయితే ఉందో అంతకాలం సంసారం తీసుకొనివస్తుంది. లోపలఉన్న సత్యవస్తువు మనకు అనుభవానికి రాకుండా చేసేదికూడా వాసనే. వాసనవలన రెండు ప్రమాదాలు ఒకటి అది సంసారంను తీసుకొనివస్తుంది, రెండు లోపలఉన్నవస్తువును అనుభవంలోనికి రానివ్వదు. బయటఏదో కల్పిస్తూఉంటుంది. తాడు తాడే కాని నీవుదానిని తొంభైరకాలుగా అనుకోవచ్చు. తాడు తాడనేసత్యం తప్పించి ఇంకోసత్యంలేదు. తాడును మీరుఒకరకంగా చూడవచ్చు, నేను ఒకరకంగాచూడవచ్చు. అది మీపిచ్చి, ఇది నాపిచ్చికాని తాడుతాడే. అలాగే ఉన్నది బ్రహ్మమే అది తప్పించిఏదీలేదు. ఆబ్రహ్మమును నీవు ప్రపంచం అనుకోవచ్చు, జీవుడు అనుకోవచ్చు, కర్మఅనుకోవచ్చు, పుణ్యంఅనుకోవచ్చు, పాపంఅనుకోవచ్చు కాని బ్రహ్మంతప్పించి రెండోది అంటూఏదీలేదు, ఒకవేళ ఉందని నీవుఅనుకొన్నా అది నీకల్పితమే. ఇదిమీకు అర్థమయితే దుఃఖంలేనిస్థితిని పొందుతారు. అయితే ఇది పాండిత్యంవలనరాదు, ధనంవలన రాదు, యశస్సువలనరాదు, కేవలం మంచిపనులు చేయటంవలనరాదు, ఈశ్వరునికరుణవలన కలుగుతుంది. ఓంవైద్యాయనమః అంటే వాసన అనేరోగాన్ని తీసేవైద్యుడు నారాయణుడు. ఆయనపాదాలను ఆశ్రయిస్తే, ఆయనపట్ల సజీవమైన విశ్వాసం కలిగిఉంటే వాసన అనేరోగాన్ని తొలగిస్తాడు. మనం ఎంతసేపు వారికి ప్రియులుగా ఉండాలి, వీరికి ప్రియులుగా ఉండాలి అనుకొంటే చివరకు బానిసత్వంవస్తుంది. మనం నారాయణుడికి ప్రియులుగా అవ్వాలి, అలా అయితే ఆయన స్వరూపాన్ని మనకు ఇస్తాడు. భౌతికసంపదకంటే ఆధ్యాత్మికసంపదగొప్పది. భౌతికసంపద తిండికి, బట్టకు, ఇంటికి ఉపయోగపడుతుంది. అంతకంటే ఎక్కువ ఉంటే భోగాలు అనుభవించటం ప్రారంభిస్తాము. ఈజన్మలో అనుభవించేభోగాలే రాబోయేజన్మలో రోగాల క్రిందవస్తాయి. ప్రపంచంలో మీకు కనిపించేభోగాలు అన్నీ అవిభోగాలుకాదు అవిదౌర్భాగ్యాలు అని ఒక ఋషిచెప్పారు. మీకు ఏదైనా భౌతికసంపదఉంటే అది మిమ్మల్ని నియమించకూడదు, మీరే ఆసంపదను నియమించాలి. భౌతికసంపద పునర్జన్మలోనికి రాదు, ఆధ్యాత్మికసంపద పునర్జన్మలోనికి వస్తుంది. భగవంతుడిని తెలుసుకోవటానికి ఇప్పుడు చిన్నప్రయత్నంచేసినా ఈప్రయత్నం, ఈసాధన రాబోయేజన్మలో నీకు కలిసివస్తుంది. ఈశరీరంచనిపోయేలోపు ఒకవేళనీకు జ్ఞానం కలుగకపోయినా నీవుకంగారుపడవద్దు, నీవుచేసిన సాధనఅంతా కూడా నీకు రాబోయే జన్మలోకలిసివస్తుంది అని భగవంతుడు చెప్పాడు. తాడు తాడుగా కనిపిస్తే భయకారణంలేదు, తాడుపాముగా కనిపిస్తే భయంకలుగుతోంది. నిజంగా పాములేదు,

ఉన్నదితాడే. ఈలోకంలేదు, ఈలోకం ఉన్నదానివలె నీ మనస్సుకు కనిపిస్తోంది. మనస్సు అణిగిపోతే ఉన్నది ఉన్నట్లుగా నీకు తెలుస్తుంది. సబ్జక్టును ప్రోపర్‌గా అర్థంచేసుకోకుండా ఏదో ఆసనాలు వేస్తున్నాము, ముక్కులో గాలి చూసుకొంటున్నాము అంటే భగవంతుడు మోసపోడు. సబ్జక్టును ప్రోపర్‌గా అర్థంచేసుకోండి, రాజీపడవద్దు, రాజీపడుతున్నారు అంటే మీకు ఎక్కడో బానిసత్వం ఉందిఅనిఅర్థం. బానిసత్వంలో ఎంతకాలం బ్రతుకుతారు. ఆత్మవిశ్వాసం లేనివారికి ఆత్మజ్ఞానం కలుగదు. ముందు ఆహారనియమంముఖ్యం ఆహారనియమము వలన నీకు ఇంద్రియనిగ్రహం వస్తుంది, ఇంద్రియనిగ్రహం వలన మనోనిగ్రహం కలుగుతుంది. ఆహారశుద్ధివలన అంతఃకరణ శుద్ధి వస్తుంది. మీరు ఏదైనా ఒక అలవాటులోనుండి బయటపడాలంటే ఎంతో సాధనచేస్తేగాని దానిలోనుండి విడుదల పొందలేరు. వాసన యొక్క వేగం తగ్గాలంటే ఈశ్వరుని పాదాలయందు నీకు భక్తికుదరాలి, ఆయన మీదనీకు పరిపూర్ణమైన విశ్వాసంఉంటే తప్ప వాసననశించదు. సమాజంతో ఎంతవరకు ఉండాలో అంతవరకే ఉండాలి. అతిగా ఉండకూడదు, అతిగాఉంటే లోకవాసనపెరుగుతుంది. మనకు మనస్స ద్వారా, దేహంద్వారా లోకంతోటి అనుబంధంవస్తోంది. దేహం ఉన్నవాడికి, మనస్సుఉన్నవాడికి లోకంగాని, దేహంలేనివాడికి, మనస్సులేనివాడికి లోకంలేదు. ఇది ముందు అర్థం చేసుకోవాలి. సమాజానికి ఉపయోగపడటంవేరు, లోకవాసన పెంచుకోవటంవేరు. పద్మం బురదలోనే ఉంటుంది గాని పద్మానికి ఆబురద అంటుకోదు అలాగే మనంలోకంలో ఉన్నా లోకంయొక్క బురద మనమనస్సుకు అంటుకోకుండా చూసుకోవాలి. అది ముఖ్యం. నీలోఏదైనా బలహీనత ఉంది అనుకో. అదిలేనివారితో సహవాసంచేస్తూ, రెండోప్రక్క ఈశ్వరుని ప్రార్థిస్తూ ఇలా సిన్సియర్‌గా చేస్తూఉంటే కొంతకాలానికి ఆవాసననశిస్తుంది. ఒకరోజు గౌతమబుద్ధుడి దగ్గరకు ఎవరోవచ్చి నిందించారు, ఆయన ప్రశాంతముగాఉన్నాడు, ఏమీసమాధానం చెప్పలేదు. అతను మరుసటిరోజున వచ్చినేను మిమ్మల్ని నిందించి చాలాపొరపాటుచేసాను, సారీ అన్నాడు. అప్పుడు బుద్ధుడు ఏమిచెప్పాడు అంటే మీరు నిందించేటప్పుడు నాలోపలఏమైనా వికారంవస్తోందా, లేదా అని చూసుకొన్నాను, అదిచూసుకోవటానికి మీరు ఉపయోగపడ్డారు, మీరు కూడా నాకు గురువే అని చెప్పాడు. ఏమనిషి అయినా బాగుపడటానికి వాడే కారణం, పాడైపోవటానికి వాడేకారణం, వాడి మనస్సును జాగ్రత్తగా కంట్రోలు చేసుకొంటే బాగుపడతాడు, మనస్సును కంట్రోలు చేసుకో లేకపోతే పాడైపోతాడు.





ఈశ్వరుడికి దీనికి సంబంధంలేదు. వాడు తన మనస్సును ఉద్ధరించుకోవటానికి ప్రయత్నం చేస్తూ ఉంటే ఈశ్వరుడి సహాయంవస్తుంది. సమాజంలో ఎంతోకొంతక్రూరత్వం ఉంటుంది. ఆక్రూరత్వాన్ని ఎంతవరకు తట్టుకోగలుగుతున్నావు అది నీకు పరీక్ష. మీరాభాయిని అత్తమామలు అనేక బాధలుపెట్టారు. మీరాభాయి ఒక మాటచెప్పింది అత్తమామలు పెట్టే ఇబ్బందివలన భగవంతుడిని పొందాలనే కాంక్షలోగాని, భగవంతునిమీద నాకుఉన్న ఏకాగ్రతలోగాని ఏమీడైవర్షన్ రాలేదు అని చెప్పింది అంటే నామనస్సు ప్రక్కకు తిరగలేదు అని చెప్పింది. ఆవత్తిళ్లకు తట్టుకోలేక ఆవిడమనస్సు ప్రక్కకు పోయింది అనుకోండి, గమ్యాన్ని మర్చిపోయింది అనుకోండి, ఆవిడపతనమయిపోతుంది. మనపని ఏదోమనం శ్రద్ధగా చేసుకోవాలి. మీరు సమాజానికి ఉపయోగపడాలంటే ఉపయోగపడవచ్చు అదయినా కర్తలేనికర్మచేయాలి. మీపూర్వజన్మలు ఎలాంటివి అయినా, ఇప్పుడు ఈజన్మలో మీరు ఎలాఉన్నా ఈశ్వరుడిచేతిలో పనిముట్టుగా ఉండటం నేర్చుకొంటే మీ జన్మలతో నిమిత్తం లేకుండా మీ దుఃఖం అంతా ఇప్పుడేఇక్కడే ఈక్షణంలో చల్లారిపోతుంది. ఎంతపెద్దగడ్డిమేటు అయినా ఒక్క అగ్గిపుల్లకు లోకువ అలాగే మీలో ఎంతదుఃఖం ఉన్నా అది శరణాగతికి లోకువ.

మనం పొందవలసిన వస్తువు మనహృదయంలోనే ఉంది. అది శాంతిగాఉందికాని మనం అశాంతిగా ఉన్నాము, అది సుఖంగా ఉంది కాని మనం దుఖంగా ఉన్నాము. లోపలఉన్న వస్తువునిశ్శబ్దంగా ఉంది కానిమనం శబ్దం శబ్దంగా, గొడవగొడవగా ఉన్నాము, లోపలఉన్నవస్తువు సింపుల్‌గా ఉంది కాని మనం కాంప్లికేటెడ్‌గా ఉన్నాము, అదిఏకంగా ఉంది కాని మనం అనేకంగా ఉన్నాము ఇంకవారు మనకుఎలా తెలుస్తారు. మనంచేసే సాధనకూడా విసుగ్గా చేయకూడదు. లోపలఉన్నవస్తువు ఎంత నిర్మలంగా ఉందో మనంచేసే సాధన కూడా అంతనిర్మలంగా ఉండాలి. మనకు సబ్జక్టు శ్రవణంచేసే అలవాటు తక్కువ. మీరు పదిలక్షలు తెచ్చుకోండి, పదిబస్తాలు కందిపప్పుతెచ్చుకోండి యజ్ఞముచేస్తాము, స్వర్గంవచ్చేస్తుంది అంటే వేసుకొని పోతాము. యజ్ఞముచేసేవాడికి సబ్జక్టు అక్కరలేదు, యజ్ఞంచేయించే వాడికి సబ్జక్టుఅక్కరలేదు. ఒక శాస్త్రీయదృక్పదంలేదు, సొంతంగా ఆలోచించుకోవటంలేదు. యజ్ఞశబ్దానికి అర్థం ఏమిటిఅంటే నువ్వు స్వార్థంలేకుండా ఏపనిచేసినా అది యజ్ఞమే. మోక్షంపొందాలి అనే కాంక్షతప్పించి మీకు ఏచిన్నకోరికఉన్నా మీరు గమ్యానికి వెళ్లలేరు. నీకు చిన్నకోరిక ఉన్నా అదిఈశ్వరుడుచూస్తూ ఉంటాడు దానికోసం నిన్ను ఇంకోజన్మలోనికి పంపుతాడు గాని మోక్షంమాత్రం ఇవ్వడు. మీదేహప్రారబ్దమును

బట్టి స్నేహితులు, విరోధులు, చుట్టాలు దొరుకుతారు, మీ దేహప్రారబ్ధమునుబట్టి వారు సిద్ధమవుతారు దానికి ఇతరులను నిందించవలసినపనిలేదు. భగవాన్ ఏమిచెపుతున్నారు అంటే నీవు లోకంతో సంబంధంతగ్గించుకో, ఎంతవరకు ఉండాలో అంతవరకే ఉండు, అతిగాఉంటే లోకవాసనపెరుగుతుంది. సత్పురుషులతో సహవాసం నేర్చుకో. మానవుడు ఏదిచేసినా వాడి కోసమే చేసుకొంటున్నాడు నీవు ఎవరితోనైనా స్నేహాలు చేసినా, విరోధాలు పెట్టుకొన్నా అవిఅన్నీ నీకోసమే చేసుకొంటున్నావు. నీకు నీవే ముఖ్యం ఇతరులు ముఖ్యంకాదు, ప్రపంచం ముఖ్యంకాదు అంటే నువ్వు తిరిగి తిరిగి నీదగ్గరకే వస్తున్నావు అంటే నీవు ఒక్కడివే నిజం ఎలా నిజం? దేహంగా నిజంకాదు, మనస్సుగా నిజంకాందు, బ్రహ్మంగా నిజం. ఏ మనిషికి చనిపోవాలని ఉండదు, లోపల ఉండాలనే కాంక్ష. ఎందుచేతనంటే నీలోపలఉన్నవస్తువుకు చావులేదు, అది నీవై ఉన్నావు అందుచేత చావుఅంటే నీకు ఇష్టంఉండదు. నీలోపలఉన్నవస్తువు యొక్కస్వరూపం సుఖం, దాని స్వరూపంశాంతి, దాని స్వరూపం ఆనందం, దాని స్వరూపం ఉండటమే. ఆఉన్నతమైనస్థితిని అందుకోవటానికి ప్రయత్నం చేయటం మానివేసి వాడు తిట్టాడు, వీడుకొట్టాడు, వాడు అలా అన్నాడుఅని ఈ గొడవలలో కూర్చొంటే ఆఉదాత్తస్థితిని మనం అందుకోలేము. మనం ఇంట్లోగెడప దాటటానికే పనికిరావటంలేదు ఇంక హిమాలయపర్వతాలకు ఎలా వెళతాము. మనకు ఇంటిదగ్గర సాధనలేదు. సాధన అంటే నదిలో స్నానంచేసినంత తేలికకాదు. సమస్తవాసనలు, తలంపులు, బలహీనతలు అన్నీ నేనుఅనే తలంపును అంటిపెట్టుకొని ఉంటాయి. మీరు సాధనమొదలుపెట్టినప్పడు ఇవి అన్నీ రేగుతాయి, ఇంతగొడవ ఉందా అని మీకు అనిపిస్తుంది. విచారణచేసేవాడికి ఆపొరలుతెలుస్తాయి, ఈగొడవఅంతా తెలుస్తుంది. మీరు సాధనమొదలుపెట్టకపోతే అజ్ఞానంలోఉండి జ్ఞానంలో ఉన్నాము అనుకొంటూఉంటారు. మన అహంభావనను అలంకరించుకొంటూ లోపలఉన్న వస్తువును తెలుసుకోవాలి అనుకొంటున్నాము. మనఅహంభావనను అలంకరించుకొనేకొలది లోపలఉన్న వస్తువుకు దూరమవుతూఉంటాము. బ్రహ్మానుభవం పొందటానికి నీవు ప్రయత్నంచేస్తూఉంటే నీకు అనేక అవరోధాలువస్తాయి, కంగారుపడవద్దు. నీవు బ్రహ్మచింతన విడిచిపెట్టకుండా ఉంటే ఈశ్వరునిపాదాలను ఆశ్రయిస్తే అవరోధాలు అన్నీ కాలిబూడిదఅవుతాయి, రాబోయేజన్మలను తీసుకొనివచ్చే వాసనలు అన్నీ ధ్వంసమవుతాయి. సత్పురుషులతో సహవాసంవలన నీవుఏద్వైతేకాదోఅందులోనుండి విడిపోతూఉంటావు, నీవుఏదిగా ఉన్నావో దానికి





దగ్గరవుతావు. ప్రపంచంలో దేనిమీద మమకారం పెట్టుకోవద్దు, దుఃఖానికి కారణం మమకారం. నీచేతిలో ఉన్న పనిని శ్రద్ధగాచెయ్యి, నిర్మలంగాచెయ్యి, ప్రియ అప్రియములు లేకుండా చెయ్యి, కోపతాపములు లేకుండా చెయ్యి. ఫలితం భగవంతుడికి విడిచిపెట్టు, వచ్చేదిఏదో వస్తుంది రానిది ఏదోరాదు. ఒకవేళ కర్మఫలం ఎలా ఉన్నా అది అశాశ్వతమే, కాలప్రవాహంలో అది నశిస్తుంది. మీదేహప్రారబ్ధమును బట్టి హెచ్చుతగ్గులు వస్తూఉంటాయి. నీకు భగవంతుడు ఏపని అయితే కేటాయించాడో దానిని నిర్మలంగాచెయ్యి, చప్పట్లుఅనవసరం, సన్మానాలుఅనవసరం. మీకు మంచిపనులు చేసినా సన్మానాలు చేయించుకొంటారు అనుకోండి ఆమంచిపనులకు సంబంధించిన ఫలితం ఈ లోకంలోనే అయిపోతుంది, ఇంక మీరు చేసినచెడ్డపనులకు నరకంమిగులుతుంది. ఒకడు చాలామంచి పనులుచేసాడటకాని మరణానంతరం నరకానికి వెళ్ళాడట. అప్పడు వాడు అడిగాడట నేను చాలా మంచిపనులు చేసాను లెక్కప్రకారం స్వర్గానికి వెళ్ళాలికాని నరకానికి తీసుకొనివచ్చారు ఏమిటి, మీరు పొరపాటుచేస్తున్నారా ఏమిటి అని అడిగాడట. ఏదీపొరపాటుకాదు నీవు మంచిపనులుచేసావు, లోకంలో గుర్తింపుకోసంచేసావు, అక్కడ సన్మానాలు పొందావు అంటే మంచిపనుల యొక్క ఫలితం అక్కడేఇచ్చేసారు, ఇంకనీవు చేసిన చెడ్డపనులకు నరకంమిగిలింది అంతేగాని ఇందులో మాపొరపాటు ఏమీలేదు అని చెప్పారట. అలా ఊరేగింపులకు, సన్మానాలకు, అవార్డులకు అలవాటుపడితే వాటికోసమే పనులు చేస్తూఉంటే వాడేకాదుమన పరిస్థితికూడా అంతే. ప్రతీపని మనంగుర్తింపుకోసం చేయటం, లోకం గుర్తిస్తే మనకు కలిసివచ్చేదిఏమిటి? ఈశ్వరుడు ప్రీత్యర్థం చేసేవాడికి గుర్తింపు ఎందుకు. నిజమైన ఆనందం నీహృదయంలోనే ఉంది అక్కడతప్పించి ఎక్కడైనా ఆనందం ఉంది అని నీకు అనిపించినా అది సుఖరూపంలో కనిపించేదుఃఖమే. తాత్కాలికంగా నీకు అక్కడసుఖం అని అనిపించినా పరిణామంలో దుఃఖంవచ్చి తీరుతుంది. నీమనస్సు ఏహృదయంలో అయితే లయిస్తోందో అక్కడే నిజమైన ఆనందం ఉంది. రహస్యంఅంతా మనస్సులోనే ఉంది మనస్సు నశించకుండా ఆత్మజ్ఞానంరాదు. ఒకసారి భగవాన్ హాలులో కూర్చొని ఏదోచెపుతున్నారు, అక్కడ ఐదుగురు ఉన్నారు. అప్పడు భగవాన్ ఒకమాటఅన్నారు. నేను చెప్పేమాటలకు మీఐదుగురుమాత్రమే వారసులుకాదు సహృదయంఉన్నవారు ఈసృష్టిలో ఏమారుమూలఉన్నా కూడా ఈజ్ఞానసంపదకు వారుకూడా వారసులే అని చెప్పారు. అయితే మీలోఎవరికైనా సహృదయం ఉంది అనుకోండి మీపట్ల నాకు అసూయఉంటే ఆ

సహృదయం నాకు తెలియదు. మనకు అర్హతలేనప్పుడు భగవంతుడేవచ్చి మనప్రక్కన కూర్చొన్నా ఆయనను మనం గుర్తించలేము. కృష్ణుడు భగవంతుడేఅని చాలామంది కౌరవులకుచెప్పారు. కాని వారు కృష్ణుడిని భగవంతుడిగా చూడలేదు, వారిలో ఉన్న దుష్టవాసనలు కృష్ణుడిఔన్నత్యాన్ని గుర్తించనీయలేదు, చివరకు నాశనంపొందారు, ఇదిగుర్తుపెట్టుకోండి. మీరు ఎన్ని శాస్త్రాలుచదివినా, మీకు ఎన్నిసంపదలు ఉన్నా, మీకు ఎంతతెలివిఉన్నా, ఎన్ని సాధనలుచేసినా ఒక్క ఆత్మజ్ఞాని సమక్షంలో మనంకూడా జ్ఞానంసంపాదించాలి అనే బుద్ధికలుగుతుందికానిమరోరకంగా మీకు ఆబుద్ధి కలిగేఅవకాశంలేదు. మీరు ఎన్నోరచనలు చేయవచ్చు, ఎన్నో ప్రవచనాలు మీరు వినవచ్చు కాని అసలువిషయం మీరు గ్రహించలేకపోవచ్చు. కాని సత్యానుభవం పొందినవాడి సమక్షంలో మీరు ఉండటంవలన అసలు సత్యంఅంటే ఏమిటి, శాంతి అంటే ఏమిటి దానితాలూక అవగాహనఎంతోకొంత కలుగకుండా మీరు ఉండలేరు, జ్ఞానంయొక్క వైభవంఅట్టిది. ఒకనాస్తికుడు, ఒకఆస్తికుడు కూర్చొన్నారట. అక్కడకు నారదుడు వచ్చాడు. నాస్తికుడు ఏమన్నాడు అంటే దేవుడు ఉన్నాడా అనినారదుడిని అడిగాడట. ఉన్నాడు అని నారదుడుచెప్పాడు. ఎక్కడ ఉన్నాడుఅని అడిగాడట. ఆయనదగ్గరనుండే వస్తున్నాను అని నారదుడుచెప్పాడు. అయితే ఆయన ఏమిచేస్తున్నాడు అనిఅడిగాడట. సూదిబెజ్జంలోనుండి ఒంటెలను, ఏనుగులను బయటకు లాగటానికి ప్రయత్నంచేస్తున్నాడు అని నారదుడు చెప్పాడు. అప్పడు నాస్తికుడు ఏమనుకొన్నాడు అంటే ఒకవేళదేవుడు ఉన్నా, నిజంగా వాడు పిచ్చవాడే సూదిబెజ్జంలోనుండి ఏనుగును లాగటంఏమిటి అనుకొన్నాడు. అక్కడఉన్న భక్తుడు ఏమనుకొన్నాడు అంటే సూదిబెజ్జంలోనుండి మనం ఏనుగును తియ్యలేకపోవచ్చు, జరుగరానిది జరిగేటట్లు చేయగలసమర్థత భగవంతుడికి ఉంది, ఆసమర్థతను మనకు తెలియజేయటంకోసం నారదుడు చెపుతున్నాడు అనుకొన్నాడు. నాస్తికుడికి, భక్తుడికి సబ్జక్టును తీసుకోవటంలో యిద్దరికి ఎంత తేడా ఉందోచూడండి. నారదుడు చెప్పినమాట ఇద్దరూ విన్నారు. ఆమాటలువిని నాస్తికుడేమో దేవుడు పిచ్చోడు అనుకొన్నాడు, ఆస్తికుడేమో దేవుడికి అసాధ్యమంటూ ఏమీలేదు, అన్నీసాధ్యమేఅనుకొన్నాడు. జ్ఞాని ఎవరినీ ప్రేమించాలని ప్రేమించడు, ప్రేమించకుండా ఉండలేడుకాబట్టి ప్రేమిస్తాడు. నిప్పుకువేడిఎంత సహజమో జ్ఞానికి శాంతి, ప్రేమ, ఉండటం అంతసహజం. నదులలో స్నానాలుచేయవచ్చు, విగ్రహాలను ఆరాధించవచ్చు కాని జ్ఞానిసహవాసంతో ఇవి సరికాదు. గురువు యొక్క దయవలన





నీవుతొందరగా పవిత్రుడవు అవుతావు. ఉపాసనలేకుండా వాసననశించదు. నారాయణుడు అనే వైద్యుడుని ఆరాధించటం ఎందుకంటే, ఆయన పాదాలను ఆశ్రయించటం ఎందుకంటే ఉపాసనలేకుండా పునర్జన్మను తీసుకొనివచ్చేవాసనలు నశించవు. ఉపాసనవలన, శరణాగతివలన వాసననశిస్తుంది. అన్నింటికంటే ఉదాత్తమైనది, శక్తివంతమైనది ఈశ్వరునిదయ. ఈశ్వరునిదయను పొందటంకోసం మనంమంచి తలంపులతో, మంచి ఆలోచనలతో మనస్సును నింపుకోవాలి. మనశరీరాన్ని, మాటను, మనస్సును ఈశ్వరునిదయ పొందటంకోసం మేగ్జిమమ్ ఉపయోగించుకోవాలి. సంసారంఅంటే ఏమీలేదు చనిపోవటం పుట్టటం మరల చనిపోవటం పుట్టటం ఇదేసంసారం. ఈసంసారం అనే రోగంలోనుండి విడుదలచేసే వైద్యుడే నారాయణుడు. సాధనపేరుమీద ఎంతోకొంతబాధ ఉంటుంది. సాధనపేరుమీద ఎక్కువబాధలేకుండా, వేదనలేకుండా భగవదనుభవం మీకు కలుగజేయటానికి గురువు ప్రయత్నంచేస్తాడు. గురువుతో ఉన్నఅనుబంధం ఈశరీరంతో పోయేదికాదు. ఆయన ఏస్థితిని అయితే పొందాడో ఆస్థితి మనకు అనుభవంలోనికి వచ్చేవరకు ప్రతీజన్మలోను గురువు మనలను వెంటాడతాడు, వాడు గురువు.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 17-08-2003, విజయవాడ

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

నేను, నాది అనే తలంపులు ఉన్నంతకాలం మానవుడు అశాంతిలోనుండి విడుదల పొందలేడు, దుఃఖంలోనుండి విడుదలపొందలేడు, రూపబుద్ధి, నామబుద్ధి వాడిని విడిచిపెట్టవు. నేను, నాది అనేతలంపులలోనుండి విడుదల పొందటమే సాధన యొక్కగమ్యం. భగవంతుడిని స్మరించటం వలన ఆయన రూపాన్ని ధ్యానించటంవలన మనం పవిత్రులం అవుతాము. మనకు లోపల పవిత్రత ఉండాలి, చేసేపనిలో ప్రవీణత ఉండాలి, ముఖ్యంగా ఏకాగ్రత ఉండాలి. భక్తులలో ప్రహ్లాదుడు అంటే నాకు ఇష్టం. ప్రహ్లాదుడిని అనేకబాధలు పెట్టారు, అనేకరకాల హింసలకు గురిచేసారు. మనకు శారీరకంగాకాని, సంసారపరంగా కాని ఏదైనా చిన్నబాధ కలిగితే ఆబాధలోనుండి విడుదలచేయమని భగవంతుడిని ప్రార్థిస్తాము. కాని ప్రహ్లాదుడిని ఎన్నిబాధలుపెట్టినా, ఎన్నిరకాలుగా హింసించినా ఆబాధలలోనుండి,

హింసలలోనుండి నన్నువిముక్తిడిని చెయ్యి అని ఆయన భగవంతుడిని ప్రార్థనచేయలేదు. ప్రహ్లాదుడియొక్క ఏకాగ్రత ఎటువంటిది అంటే, పవిత్రత ఎటువంటిది అంటే, ఆయన భక్తిలో ఉన్న నాణ్యత ఎటువంటిది అంటే తనుఇన్ని బాధలకు గురిఅవుతున్నానని ఎప్పుడూ కంప్లయింట్ చేయలేదు, వాటిని సహజంగా, నిర్మలంగా సహించాడు, అతనిభక్తి చెదరలేదు, తరగలేదు. అది భక్తుడిలక్షణం. భక్తిపేరుమీద మనం సమాజానికి, సహజస్థితికి దూరం అవ్వవలసినపని లేదు. ఈరోజు మనం ఇలాగ ఉన్నాము అంటే దానికి సమాజం యొక్క సహకారం ఎంతోఉంది, సమాజం మనకు అనేక మంచి విషయాలు నేర్పింది. ప్రతీమానవుడు సమాజం యొక్క ఋణం తీర్చుకోవాలి. అందుచేత సమాజానికి మనం చేయగలిగిన సహాయం చేస్తూఉండాలి. దానివలన సమాజానికి ఎంతో కొంత మేలు జరుగుతుంది, మనం ఆధ్యాత్మికంగా, నైతికంగా ఎంతో కొంత ఉద్ధరింపబడతాము. మన హృదయంలోఉన్న వస్తువు నిర్మలంగా ఉంది, శాంతిగాఉంది, సహజంగా ఉంది, ఏకాగ్రంగా ఉంది. అది ఎలాఉందో అలా ఉండటం మనం నేర్చుకొంటే దానిని పొందుతాము. లోకంలో మంచీఉంటుంది, చెడూ ఉంటుంది. పంచదార, ఇసుక కలిపి ఒకగుట్టక్రింద ఉంటే చీమలు పంచదారను తీసుకొని ఇసుకను వదిలేస్తాయి. చీమలు కూడా మనకు గురువులే. మనం కూడా లోకంలో ఉన్న మంచిని తీసుకొంటూ, చెడును వదిలేయాలి. అలా చెడ్డను వదిలేస్తూ ఉంటే లోపలఉన్నవస్తువును మనం తొందరగా పొందగలము అని పరమహంస చెపుతూ ఉండేవారు.

మనం దేహభావన తగ్గించుకోవాలి, దైవభావన, సామాజికభావన పెంచుకోవాలి. మనకు దేశభక్తి తక్కువ. ఇల్లు మనది అనుకొంటాము, ఆరోడ్డు మనది కాదు అనుకొంటాము. ఆరోడ్డు మనదే అనేభావన ఇంకా మనకు కలగటంలేదు. దేశభక్తి వలన, దైవభక్తి వలన హృదయం విశాలమవుతుంది. దుఃఖకారణం బయటలేదు, నీలోపలేఉంది. మనకు సబ్జక్టు సరిగా అవగాహన అవుతూ ఉంటే ఏసంఘటన వలన దుఃఖంరాదు. ప్రపంచంలో ఏసంఘటనలో దుఃఖంలేదు, ఆసంఘటనకు రియాక్టు అవ్వటం వలన నీకు దుఃఖం వస్తోంది. రియాక్షన్ తగ్గించుకోవాలి, రియాక్షన్ లేకపోతే దుఃఖంలేదు. మనం శాస్త్రాన్ని ప్రమాణంగా పెట్టుకొని జీవిస్తూ గురువును స్మరిస్తూ, సత్పురుషుని మాటలను శ్రవణం చేస్తూ తమోగుణం, రజోగుణం తగ్గించుకొంటూ సత్వగుణాన్ని పెంచుకొంటూ రావాలి. సత్వగుణం ఉన్నవాడికి యాక్షనేగాని రియాక్షన్ ఉండదు. కొంతమంది ప్రతీచిన్న విషయం ప్రతీకారదృష్టితో ఆలోచిస్తారు. ప్రతీకారదృష్టిలేనివాడికి సత్వగుణం పెరుగుతూ ఉంటుంది. మనం శాస్త్రాలు





చదువుతాము, ప్రవచనాలు వింటాము ఎంతవరకు అలా జీవించగలుగుతున్నాము అని చూసుకోము. ఇంతకాలంనుడి సబ్జక్టు శ్రవణం చేస్తున్నాము మనకు సహనంలేదు. సహనంలేకుండా సత్వగుణంపెరగదు. సత్వగుణం లేకపోతే ఆత్మజ్ఞానానికి మనకు దారికనబడదు. ఎవరి పద్ధతిలో వారు సాధనచేయాలి. సాధనచేయగా చేయగా మనం ప్రకృతికి దూరమవుతాము, భగవంతుడికి దగ్గరవుతాము. సాధనవిడిచిపెట్టకూడదు. భక్తిఅనే మొక్కను జాగ్రత్తగా పెంచుకొంటూరావాలి.

పూజ, జపం, ధ్యానం ఇవి అన్నీ మనోనిగ్రహం కోసం చేస్తున్నాము. మనస్సు అణగాలి, అణిగినమనస్సుకు అంతర్‌దృష్టి కలుగుతుంది, అంతర్‌దృష్టి కలిగినవాడికి ఆత్మజ్ఞానం కలుగుతుంది, ఆత్మజ్ఞానం కలిగినవాడికి ఆత్మసుఖం అనుభవంలోనికి వస్తుంది. అది ముగింపులేని సుఖం, ముగింపులేని ఆనందం. బాహ్యపరిస్థితులు మీకు అనుకూలంగా ఉన్నా అహంభావన ఉంటే మీకు ఆందోళన ఉంటుంది, అశాంతి ఉంటుంది, కొరత ఉంటుంది. ధనాన్ని కూడా మనం నిగ్రహించుకోవాలి. భగవంతుడు మనకు ఇచ్చిన సంపదలను, భోగాలను నిగ్రహించుకోకపోతే అవేమనలను పాడుచేస్తాయి, అవి సంపదలు కాదు ఆపదలు. బాహ్యంగా మీకు సంపదలు వచ్చినా, ఆపదలు వచ్చినా అవిస్వప్నసమానము, అవి దేహప్రారబ్దాన్ని బట్టి వస్తాయి, అనుభవిస్తే అవిపోతాయి. మీకు పరిస్థితులు అనుకూలంగా ఉంటే పొంగిపోవటం, ప్రతికూలంగా ఉంటే కృంగిపోవటం అది విడిచిపెట్టండి. అప్పుడు మీరు భగవంతుని దయకు పాత్రులవుతారు. మీ భక్తిని కేవలం పూజతో, జపంతో సరిపెట్టకండి దేహప్రారబ్దాన్ని ఎవడైతే ఇష్టంతో, సహనంతో, భక్తితో, ప్రేమతో అనుభవిస్తున్నాడో వాడికి పాతవాసనలు నశిస్తాయి, కొత్తవాసనలు రావు, వాడికి లోచూపుకలుగుతుంది, అమృతానుభవం పొందుతాడు. భౌతికసంపదఅయినా, ఆధ్యాత్మికసంపద అయినా కూడా మనకు ఎంతఅయితే యోగ్యత ఉందో అంతే వస్తుంది. మనం సాధనచేసి యోగ్యత సంపాదించుకోలేకపోతే శాస్త్రం కూడా మనకు పూర్తిగా అర్థంకాదు అందువలన యోగ్యత సంపాదించుకోవాలి, సాధన వలన, నిరంతరం భగవంతుడిని స్మరించటం వలన మనకు యోగ్యతకలుగుతుంది. అవస్థలుమారుతున్నాయి జన్మలు మారుతున్నాయి, సమాజపరిస్థితులు మారుతున్నాయి కాని మారకుండా ఉన్నది చైతన్యం ఒక్కటే. ప్రతీవిషయం మనం అనుకొన్నట్లు జరగాలి అనుకొంటాము, అలాజరిగితే మనకే ప్రమాదం. మనకు ఏదిమంచిదో మనకంటే భగవంతుడికి ఎక్కువతెలుసు. భగవంతుడు దయామయుడు. మనం

ప్రమాదంలో పడకుండా ఉండటం కోసం ఆపనులు ఆపుచేస్తాడు. నీవు ఆధ్యాత్మికంగా అభివృద్ధి అవ్వటం కోసం కొన్నిసంఘటనలు క్రియేట్‌చేస్తాడు అది నీ మంచికోసమే చేస్తున్నాడు అని నీకుతెలిస్తే నీవు పుణ్యాత్ముడవు. అది నీ మంచికోసమే అని నీకు అర్థం అవ్వకనీవు ఆందోళనపడుతున్నావు. ఆందోళన పడవలసింది అంటూ ఈసృష్టిలో ఏమీలేదు. ఒక్క బ్రహ్మంతప్పించి మిగిలినవన్నీ నీ మనస్సుయొక్క కల్పితములే. మనస్సు అణిగిపోతే ఏమీలేదు. మీదేహాన్ని ఎవరైనా విమర్శిస్తే తట్టుకోలేకపోతున్నారు అంటే దేహమేనేను, దేహమే సత్యం అనే బుద్ధిఎక్కువగా ఉంది కాబట్టి తట్టుకోలేకపోతున్నారు. ఆసంఘటన అలా జరిగింది ఏమిటి? ఈ సంఘటన ఇలాజరిగింది ఏమిటి అంటే అది ఈశ్వరుడికి తెలియకుండా జరగటంలేదు. ఈగోలనీకు ఎందుకు. నీకంటే అతీతమైన శక్తి ఒకటిఉంది, ఈలోకానికి యజమాని ఒకడు ఉన్నాడు, ఆయనకు శరణాగతి చెందు. ప్రతీమానవుడు దుఃఖం రాకూడదు అనుకొంటాడు కాని దుఃఖంవచ్చే పనులు చేస్తాడు. పాపంవలన దుఃఖంవస్తుంది, పుణ్యంవలన సుఖంవస్తుంది, అజ్ఞానంవలన బంధం వస్తుంది, జ్ఞానంవలన మోక్షం వస్తుంది. లోపలఉన్నవస్తువుఏకంగా ఉంది, నిశ్చలంగా ఉంది, చావుపుట్టకలతో దానికి సంబంధంలేదు, దానిస్వరూపమే జ్ఞానం. అది ఎలా ఉండాలో అలా ఉందికాని నీవు ఊహించినట్లు అదిలేదు. అది అనుభవంలోనికి వచ్చేవరకు అది ఎలా ఉందోఅదినీకు తెలియదు. అది అనుభవంలోనికి వస్తే నీవు సుఖపడతావు, అది అనుభవంలోనికి రాకపోతే ప్రకృతినిన్ను విడిచిపెట్టదు జన్మజన్మలకు దుఃఖంనిన్ను వెంటాడుతుంది. సాధ్యమైనంతవరకు మనస్సు యొక్క చాపల్యాన్ని తగ్గించుకోవాలి. మనస్సుకు చాపల్యం ఎప్పుడైతే తగ్గిందో దానికి అంతర్‌దృష్టి కలుగుతుంది. నీ దుఃఖానికి కారణమైన మూలతలంపును పరిష్కారం చేసుకోకుండా అక్కడ దేవుడిని చూసాను, ఇక్కడ దేవుడిని చూసాను అంటే అది నీ మనస్సుకు కనిపించే విషయమేగాని వాస్తవంకాదు. నీకు దేవుడు కనిపించవచ్చు, వరం ఇవ్వవచ్చు, ఆవరాన్ని నీవు ఎంజాయ్ చేయవచ్చు. ఇదంతా వ్యవహారికసత్యమేగాని పారమార్థికసత్యంకాదు. మూలతలంపును విజృంభించకుండా దానిని ఉపసంహరించి దాని మూలంలో ఉంచగలిగితే అదినశిస్తుంది. అదినశిస్తే నీవు నశించవు, అక్కడ ఉన్న నారాయణుడే నీకు స్వరూపంగా వ్యక్తమవుతాడు.

మనకు తలంపులు ఎక్కువ వస్తున్నాయి అంటే భగవంతుని యందు మనకు శరణాగతి లేదుఅని అర్థం. ఉన్నది ఒక్కడే. అంతాఆయనదే. ఆయనదే ఆయనకు ఇచ్చి నేను ఇచ్చాను అనుకొంటున్నాము, వ్యక్తిభావన పెంచుకొంటున్నాము. అంతానువ్వే అనుకొంటే





ఏమీలేదు. ఏది జరిగినా ఆయనసంకల్పమే. భగవంతుని సంకల్పాన్ని గౌరవించే అలవాటు మనకులేదు. భగవంతుడి సంకల్పాన్ని గౌరవిస్తే నీసాధనతో నిమిత్తం లేకుండా ఇప్పడే, ఇక్కడే, ఈక్షణంలోనే నీమనస్సు అణిగిపోతుంది, శాశ్వతశాంతిలో ఓలలాడతావు. నీకుఏదైనా ఉంది అనుకో ఈశ్వరుడు దానిని నీకు కేటాయిస్తే అదివచ్చింది. దానిని నీసొంతం అనుకొని అహంభావన పెంచుకోవద్దు. పాపాత్ముడిని తిడితే వాడు నిన్ను కొడతాడు, అదే పుణ్యాత్ముడిని తిడితే వాడు బాధపడుతాడు, భరించి ఊరుకొంటాడు దానివలన నీకు పాపంవస్తుంది. వాళ్ళను, వీళ్ళను తిట్టేబదులు నన్ను తిట్టండి అనేవారు భగవాన్. ఎందుకంటే మనస్సు ఉంటే రియాక్షన్ ఉంటుంది, మనస్సు నశించినవాడికి రియాక్షన్ ఉండదు, అంతాతానే. మరణించిన తరువాత ఏదోలోకాలకు వెళతాము ముందు ఇప్పడుటైమును స్వద్వినియోగం చేసుకోండి. పుణ్యలోకాలు ఉన్నాయి అవి ఎంజాయ్‌మెంట్‌కు పనికివస్తాయి కాని నీవు సాధన చేయాలంటే మరల దేహంధరించి ఈభూమిమీదకు వచ్చి సాధన చేయవలసిందే, మనకు రాగద్వేషములు తగ్గలేదు, భగవంతుడు అనుభవంలోనికి వచ్చేయాలి, ఎలా కుదురుతుంది. మనకు అర్హతవచ్చినప్పడు, యోగ్యతకలిగినప్పడు మనకు తెలియబడటానికి భగవంతుడు ఒక్కక్షణం కూడా వెయిట్ చేయడు, వెంటనే తెలియబడతాడు. అయితే ఆ యోగ్యత, అర్హత సంపాదించటానికి మనం సాధనచేయాలి, సత్పురుషుల సహవాసం చేయాలి. ఏచింతన లేకుండా భగవంతుడినే చింతిస్తూ ఉండాలి. అనన్యచింతన ఒక్కసారే రాకపోవచ్చు కాని క్రమేపి వస్తుంది. ముందుపాక్షికశరణాగతి నీకు అలవాటుఅయితే తరువాత నీకు పూర్ణశరణాగతి వస్తుంది. ఏది ఎప్పడు జరగాలో అది అప్పడు జరుగుతుంది. నీవు చేతిలో ఉన్నపనిని ఇష్టంగా, ప్రేమగా భక్తిగా చెయ్యి. ఫలితం ఎప్పడు రావాలో అప్పడు వస్తుంది, అది ఈశ్వరనిర్ణయానికి వదిలెయ్యి. వారు ఇస్తారు లేకపోతే ఇవ్వరు అదినీకు అనవసరం, కాని నీవు చేసేపనిలో మాత్రంలోపం ఉండటానికి వీలులేదు. వారు ఎందుకు ఇవ్వలేదు అని అనుకొంటే నీకు శరణాగతిలేదు అని అర్థం. ప్రపంచంలో ఉన్న అన్ని భోగాలు మన ఎదురుగా ఉండాలి, మన మనస్సులో వికారం కలుగకూడదు, అది నిజమైనస్థితి అని కాళిదాసు చెప్పాడు. నీవు 100 కోట్లు సంపాదించావు అనుకో, దానిలో సమాజం యొక్క సహకారంకూడా ఉంది. నీసంపాదనలో సమాజంకోసం ఎంతవరకు ఉపయోగించావు అది చూసుకో. తలంపువచ్చాక మాటవస్తుంది, తలంపువచ్చాక పనిచేస్తాము. తలంపురాకుండా ఉంటే మంచిదే. తలంపువచ్చిందా దానిని కంట్రోలు చేసుకోవాలి, దానిని

విచ్చలవిడిగా వదిలేస్తే పతనమవుతాము.

ఉన్నదిఏదో ఉంది, లేనిది ఏదోలేదు. ఉన్నదానికి లేకపోవటం అంటూలేదు, లేనిదానికి ఉండటం అంటూ లేదు, ఇది నిశ్చయము అని భగవంతుడు చెప్పాడు. ఈవిషయంలో మీకు సందేహం అక్కరలేదు. లోపల ఈశ్వరుడు ఉన్నానని చెపుతున్నాడు. నమ్మినవాడికి సొమ్ము, నమ్మనివాడికి దుమ్ము. ఇక్కడ గుడిలో కూర్చొని భగవంతుడు ఉన్నాడు అనుకొంటాము. బయటకు వెళ్ళినతరువాత భగవంతుడు లేడు అనుకొంటాము, ఇలా అనిపించటానికి మనలో పాపం కారణం. మనలో ఉన్నపాపం ఈశ్వరుని అస్థిత్వాన్ని తొందరగా అంగీకరించటానికి ఒప్పకోదు. మనకు తగినంత పుణ్యబలం లేకపోవటం వలన అటువంటి తలంపులు వస్తాయి. ఎంతకాలం అయితే మనలో రాగద్వేషములు ఉంటాయో అంతకాలం శరీరాలు వస్తూనే ఉంటాయి. ఇక్కడ మనకు భగవాన్ చెప్పినబోధ ఏమిటి అంటే నీహృదయంలో సత్యం ఉంది. అది మనకు తెలియటంలేదు కాని ఉంది. ఉండటం ఉండటమే, అది ఎలా ఉండాలో అలా ఉంది కాని నీవు అనుకొన్నట్లుగా అది లేదు, దానిలో ఐక్యం అవ్వటంకోసం నీశరీరాన్ని మనస్సును జాగ్రత్తగా ఉపయోగించుకో. అహంకార, మమకారములతో ఉన్నవాడు వాడిగురువు ఎవరైనా, ఏసాంప్రదాయంలో ఉన్నా కూడా శాంతిసాగరంలో ఐక్యం అవ్వటానికి అవకాశంలేదు. అందుచేత అహంకార, మమకారములనుండి విడుదలపొందటానికి నీశరీరాన్ని, మనస్సును ఉపయోగించుకో. కొంతమంది సత్పురుషులు ఎలా ఉంటారు అంటే వారు లోపలకు వెళితే వారిని వారు చూసుకొంటూ ఉంటారు, బయటకువస్తే ఉన్నదానిని మనకు చూపిస్తూ ఉంటారు. లోపలకు వెళితే ఆనందం, బయటకువస్తే ఆనందం, ఎటుచూసినా ఆనందమే. వారి ముఖాలను చూస్తే మోక్షం సంపాదించాలి అనేకాంక్ష మనకు కలుగుతుంది, మనకు తెలియకపోయినా లోపల ఏదో ఉంది, లేకపోతే వారు అంతఆనందంగా ఎలా ఉంటారు, మనం కూడాదానిని పొందాలి అనే కాంక్షమనకు కలుగుతుంది. సజ్జనసాంగత్యం అన్నీ ఇస్తుంది, మోక్షాన్ని కూడా ఇస్తుంది.



ఓం నమోభగవతే శ్రీరమణాయ

## భగవత్ స్వరూపులు, పూజ్య గురుదేవులు అయిన సద్గురు శ్రీ నాన్నగార్కి గురుపౌర్ణమి మహోత్సవ సందర్భముగా సమర్పించు

# భక్తి సుమాంజలి



శ్రీ భూపతిరాజు వెంకటలక్ష్మీనరసింహరాజు! మా పాలిట మా నాన్నగారు!!
మిమ్ముగన్న తల్లిదండ్రులు రాజయమ్మ, సూర్యనారాయణరాజులు ధన్యులైరి
రమణభగవానుని పిలుపుతో పలికి, భగవాన్ దివ్యబోధనలతో
**ఆత్మానుభవం పొంది**, మమ్ము ఆశీర్వదించి
జాగృతిపరమైన జిన్నూరు జీవగడ్డమీద రమణక్షేత్రమును నిర్మించి
**అరుణాచలేశ్వరుని** ఆశీస్సులు మా అందరికి పంచి
నాడు రమణసన్నిధిలో ఆంధ్రాశ్రమమునకు స్థానము కల్పించి
నేడు నాన్నగారి ఆశ్రమానికి ఆద్యులై నిలచి
పేద విద్యార్థుల పాలిట "సద్గురు శ్రీ **నాన్నగారి చారిటబుల్ ట్రస్టు**"
నేడు ఆధారమై విద్యను యిచ్చి
ఆధారములేని ఎందరో వృద్ధులకు వృద్ధాప్య ఫించనులను ఇప్పి
వారికి ఆరాధ్యదైవమై నిలచి
కళాశాలలు, కళ్యాణ మండపములనుండి, సరస్వతి శిశుమందిరాలకు
మీ దానములతో దారిచూపి
అధికారులనుండి వ్యాపారవేత్తలు, రాజకీయవేత్తల వరకు
రాజకీయములేని రమ్యమైన ప్రేమను చూపి
భైర్రాజు, గోకరాజు, కనుమూరి, భూపతిరాజులను మీ హస్తవాసితో ఆదరించి
నాన్నగారి మాట సకల సౌభాగ్యముల మూట!
నాన్నగారి దృష్టి మా పాలిట పారిజాతవృష్టి!
నాన్నగారి చేతి ప్రేమ, తల్లిప్రేమలోపలి హాయి!
"**రమణభాస్కర**" ముద్రణతో వేయి, వేల గ్రామాలు సత్సంగానిలయములై
దేశ, విదేశములలో భక్తుల వినయ విశ్వాసనీయములను పొంది
మృదు, మధురమైన పి.యబి.యస్.రాజు, శ్రీరామరాజులను
మీ సంస్థలకు అధ్యక్ష కార్యదర్శులుగా నియమించి
సద్గురు సేవలో జీవితాంకితమైన "రామచంద్రరాజు" అనుంగ శిష్యునిగా రాణించగలిగి
పార్వతమ్మ, హైమవతి, సుజాత, లక్ష్మి, పద్మజ, నరసింహరాజులు భక్తి ప్రపత్తులతో
మీ ప్రవచన ప్రచార రథ సారథులుగా నిలచి
**"మిమ్ము, మిమ్ముగాను మే మెరింగిన యంత**
**మమ్ము, మమ్ము మేము మరిచాము నాన్నగారూ"!!**
మీ ఆత్మబంధువులయిన మా భక్తుల పాలిట మీ అనుగ్రహముతో
కరుణచూపి కాపాడి, నాన్నగారి ప్రవచనములు ప్రపంచ ఖ్యాతి పొంది
ప్రజలు ప్రశాంతత పొందుగాక

ఇట్లు
నాన్నగారి పాదారవిందములకు నమస్కరిస్తూ
వినయ విధేయ భక్తి శ్రద్ధలతో ప్రార్థిస్తూ
మీ భక్తులు

జిన్నూరు
**తేది : 13-7-2003**

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

| | | |
|---|---|---|
| 3-9-03 to 16-9-03 | | కేంపు |
| 23-09-03 | మంగళవారం | జిన్నూరు, సద్గురు శ్రీ నాన్నగారి జన్మదిన మహోత్సవము, శ్రీ రమణ క్షేత్రం |
| 28-09-03 | ఆదివారం | గుమ్మలూరు |



చింతపర్రు గ్రామంలో వేంచేసియున్న కనకదుర్గాదేవి ఆలయ ప్రాంగణంలో శ్రీ రమణక్షేత్రం ప్రెసిడెంట్ చింతపర్రు వాస్తవ్యులు శ్రీ పి.ఎస్.ఎన్.రాజు & బ్రదర్స్‌చే నిర్మించిన మండపాన్ని సద్గురు శ్రీ నాన్నగారి అమృతహస్తాలతో ది.2-9-2003న ప్రారంభించినారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ శ్రీ పెన్మెత్స నారాయణరాజు, ఆలయ కమిటీ సభ్యులు మరియు గ్రామపెద్దలు హాజరైనారు.



సద్గురు శ్రీ నాన్నగారిని సన్మానం చేస్తున్న చింతపర్రు గ్రామ సర్పంచ్ శ్రీ పెన్మెత్స నారాయణ రాజు దంపతులు





ది. 17-08-03 ఆదివారం మధ్యాహ్నం విజయవాడ, ముత్యాలంపాడు, రామలింగేశ్వర స్వామివారి ఆలయంలో ప్రవచిస్తున్న సద్గురు శ్రీ నాన్నగారు

### రమణ భాస్కర పక్షపత్రిక సంవత్సర చందా రు. 150/-

సంవత్సర చందాకు ది॥ 23-9-2003 నుండి ది॥ 22-9-2004 వరకు క్రమం తప్పకుండా ముద్రించిన పత్రికలు పంపబడతాయి. మీరు యం.ఓ. / డి.డి. / నగదు రూపంగా పంపించవలసిన చిరునామా.

**పెన్మెత్స శ్రీరామరాజు**

**("రమణభాస్కర" కొరకు)**

**శ్రీరమణ క్షేత్రం, జిన్నూరు - 534 265, ప॥గో॥జిల్లా, ఆంధ్రప్రదేశ్**

పేరు ........................................ తండ్రి / భర్త

........................................ డోర్ నెం ....................

వీధి / రోడ్ నెం .................... గ్రామం ....................

పిన్ కోడ్ .................... మండలం .................... జిల్లా

.................... డి.డి. / యమ్.ఓ. / నగదు వివరాలు ....................

ఫోన్ నెం....................